క్లుప్తంగా

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



ఆజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు మౌలాన అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతిని విద్యా దినోత్సవం జరుపుకుంటున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయతోపాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, శ్యాముల్ రాజ్, బి.లక్ష్మి, ప్రతాప్, ఎస్.వి.రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



సమస్యలు తెలుసుకుంటున్న డీఎం అరుణ

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రజా రవాణశాఖ మద్దిలపాలెం డిపో పరిధిలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని డిపో మేనేజర్ ఎన్.అరుణకుమారి తెలిపారు. గోపాలపట్నం నుంచి ఎండాడకు బస్సు నడపాలని రామారావు అనే ప్రయాణికుడు కోరాడు. అలాగే 541 బస్సుల సంఖ్య పెంచాలన్నారు.తగరపు వలస నుంచి విశాఖ వచ్చే సిటీ బస్సులను రాజుల తాళ్లవలస అంబేడ్కర్ బొమ్మ వద్ద స్టాప్ ఏర్పాటు చేయాలని సిద్ధార్థ అనే ప్రయాణికుడు కోరారు. ఐటీ హిల్స్ నుంచి వుడా కాలనీ జనరల్ సర్వీసు నడపాలని నాగేశ్వరరావు కోరాడు. మద్దిలపాలెం నుంచి గంధవరం బస్సు నడపాలని గజపతి రాజు కోరారు. ఆరిలోవ– గాజువాక నేరుగా బస్ సర్వీసు నడపాలని ప్రవీణ్ కోరారు. వీటిన్నంటికీ సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని డిపో మేనేజర్ అరుణ కుమారి తెలిపారు.

ఆజాద్‌కు నివాళి



ఆజాద్ చిత్ర పటానికి నివాల అర్పిస్తున్న నరవ ప్రకాశరావు

ఆరిలోవ: విశాఖవ్యాలీ స్కూల్ సమీపం ప్రభుత్వ బాలికల వసతి గృహంలో శనివారం బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఆజాద్ జాతీయ విద్యా విధానాన్ని రూపకల్పన చేశారన్నారు. ఆయన ఏర్పాటుచేసిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ దేశంలో ఉన్నత విద్యాభివృద్ధికి దోహదపడిందన్నారు. కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ ఎస్.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ బీసీ సంఘం కార్యదర్శికి అభినందన



మురళిని అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం కార్యదర్శిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగి పీతల మురళి నియమితులయ్యారు. ఇటీవల హైదరాబాదులో నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్‌ల చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మురళిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో శనివారం అభినందించారు.

పిక్నిక్‌లకు ముడసర్లోవ ముస్తాబు

- పార్కును శుభ్రం చేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పన



శుభ్రంగా మారిన పార్కు



పార్కులో ఆట పరికరాలు

ఆరిలోవ: కార్తిక వనసమారాధనలకు పార్కులు సిద్ధమవుతున్నాయి. సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. పిక్నిక్‌లకు అనుగుణంగా శుభ్రం చేస్తున్నారు. ముఖ్యంగా ఆరిలోవ ప్రాంతంలో ఉన్న ముడసర్లోవ పార్కు వనసమారాధనలకు ఎంతో అనుకూలమైనది. ఏటా వేలాది మంది ఇక్కడకు వస్తుంటారు. దీంతో జీవీఎంసీ అధికారులు సందర్శకులు కోసం ఈ పార్కును వారం రోజులు పాటు శుభ్రం చేయించారు. ఇంతవరకు దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. పార్కును ఆనుకొని ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్ గట్టును సిద్ధం చేశారు. ఇక్కడ పిల్లల ఆట పరికరాలు చుట్టూ చెత్త లేకుండా చర్యలు చేపట్టారు. పిల్లలు కోసం ఏర్పాటు చేసిన తూగుడు బల్లలు, ఊయలలు, జారుడు బల్లలు, రంగులరాట్నం తదితర పరికరాలు ఉన్నాయి.



పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేసిన రిజర్వాయరు గట్టు

ప్రశాంతమైన వాతావరణంలో పార్కు

ముడసర్లోవ పార్కు ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కు విశేషంగా ఆకట్టుకుంటోంది. పార్కుకు ఇరుపక్కల దట్టమైన కొండలు పచ్చదనంలో కనువిందు చేస్తున్నాయి. మరో పక్క నీటితో నిండిన రిజర్వాయరు ఆహ్లాదానికి మరింత తోడుగా నిలిచింది. ఓ పక్క కంబాలకొండలు, మరో పక్క సింహాచలం కొండలు, పక్కనే రిజర్వాయరు ఆహ్లాదాన్ని పంచుతాయి. కార్తీక మాసంలో వన భోజనాలు నిర్వహించడానికి నగరంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాలు నుంచి అధిక సంఖ్యలో వస్తుంటారు.

దీన్ని దృష్టి పెట్టుకొని అధికారులు పార్కును సిద్ధం చేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ వేంకటేశ్వరరావు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో 100 మంది కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీ వార్డు నాయకుడు కె. ప్రసాద్ వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ మేరకు పార్టీ తూర్పు నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీవీ, తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలికుడు మొల్లి అప్పారావు సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ ఇంచార్జి పల్లా దుర్గారావు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

అల్లిపురం : వేంకటేశ్వర మెట్టలోని వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. అలంకరించిన పూలరథంపై సాముగరిడీలు, మహిళలచే కోలాటం, తప్పెటగుళ్లు, తోడపెద్దు సేవలతో కోలాహలంగా అమ్మవారిని తోడ్కొని వచ్చారు.

మార్కెట్‌కు దీపావళి శోభ



అల్లిపురం కుమ్మరివీధిలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఆకట్టుకుంటున్న డిజైనర్ ప్రమిదలు

అల్లిపురం : దీపావళిని పురస్కరించుకుని అల్లిపురం మార్కెట్‌తో పాటు రామకృష్ణా రైతు మార్కెట్ శనివారం కళకళలాడాయి. చెరకు గడలు, ఆముదం కర్రలు, గోంగూర కాడల అమ్మకాలు జోరుగా సాగాయి. చెరుకుగడ ఒకటి రూ.30 నుంచి రూ.50, ఆముదం కర్ర సైజును బట్టి రూ.10 నుండి రూ.20కు అమ్ముతున్నారు. పువ్వుల ధరలు కూడా డజను బంతి పూలు రూ.30 నుండి రూ.40కి అమ్ముతున్నారు. కొబ్బరికాయ సైజుని బట్టి రూ.25 నుండి రూ.35కి అమ్ముతున్నారు. మందుగుండు సామగ్రి అమ్మకాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. పోలీసులు నిఘా పెట్టటంతో చిరువ్యాపారులు వాటిని అమ్మడానికి భయపడుతున్నారు. ఆదివారం అమావాస్య కావటంతో దిష్టి గుమ్మడికాయలు, నిమ్మకాయల అమ్మకాలు జోరుగా సాగాయి. డిజైనర్ దీపాలు, మట్టి ప్రమిదల అమ్మకాలతో అల్లిపురం కుమ్మర వీధి కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఈ ప్రాంతంలో కలకత్తా దీపాలు, రంగు రంగుల దీపాలు, లక్ష్మీదేవి పూజ సందర్భంగా వినాయకుడు, లక్ష్మీదేవి ప్రతిమల అమ్మకాలు జోరందుకున్నాయి. వీధుల్లో ఎక్కడా బాణసంచా హడావుడి అంతగా కనిపించలేదు.

ఏయూలో జాతీయ విద్య దినోత్సవం



ఆజాద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఆచార్య షారోన్‌రాజు తదితరులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జాతీయ విద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏయూ విద్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత దేశ ప్రథమ విద్య శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ భారత దేశంలో విద్య సంస్కరణలకు అవకాశం కల్పిస్తూ విద్య బలమైన ఆయుధంగా నిలుస్తుందని, అందరికీ విద్యను చేరువ చేయడానికి మౌలానా అబుల్ కలాం అజాద్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య నాగరాజ కుమారి, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్, డాక్టర్ అజల్ ఫకీర్ ఆలీ, డాక్టర్ బి.ప్రవీణా దేవి, డాక్టర్ కె.రాము. డాక్టర్ వెనీలా కుమారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో చేపట్టిన పలు నిర్మాణాలను నా ణ్యతతో నిర్మించాలని పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతాల గోవింద్ అధికారులను కోరా రు. శివాజీపాలెం రో డ్డులో వేస్తున్న ఫుట్‌పాత్ నిర్మాణం నాణ్య త లేకపోవడాన్ని గమనించిన ఆయన జీవీఎంసీ ఏఈకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఏఈ నిర్మాణం వద్దకు చేరుకొని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరుకు వినతి

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో రూ. 5 కోట్లతో నిర్మించిన 152 దుకాణాలను అధికారులు ఐదేళ్ల కిందటే వ్యాపారులకు అందజేశారు. అయితే ట్రేడ్ లైసెన్సులు మాత్రం ఇవ్వలేదు. నగరంలో పూర్ణామార్కెట్ తర్వాత అంతటి ప్రాముఖ్యత గల రామకృష్ణా రైతుబజార్‌లో నిత్యం రూ. లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయకపోవడం వల్ల జీవీఎంసీ పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోతుందని పలువురు పేర్కొంటున్నారు. తమకు జీవీఎంసీ ట్రేడ్ లైసెన్సులు ఇస్తే తమ దుకాణాలను అభివృద్ధి చేసుకుంటామని వ్యాపారులు చెబుతున్నారు. ఈ అంశంపై ఏఎంహెచ్‌వో ఎ. రాజేష్ మాట్లాడుతూ రామకృష్ణా రైతుబజార్ వ్యాపారులకు ఇప్పటి వరకు ట్రేడ్ లైసెన్సులు ఎందుకు ఇవ్వలేదనే విషయంపై ముందుగా పరిశీలన చేస్తామన్నారు. ఆ తర్వాతే లైసెన్సులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.